www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 14 డిసెంబర్ 2024
5
వైఎస్ఆర్

నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 13న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సంద ర్భంగా జిల్లా వ్యాప్తంగా 20 బెంచీలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రజలు, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని రాజీమార్గం ద్వారా తమ కేసులను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కారం అయ్యేందుకు అన్ని శాఖల అధికారులు న్యాయవాదులు తమ వంతు సహకరించాలని కోరారు. కడపలో 5, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 2, రాయచోటిలో3, బద్వేల్‌లో 2, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, జమ్మలమడుగు, పులివెందల, కమలాపురంలలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామని చెప్పారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో రగడ!

- పులివెందుల కేంద్రంగా వైసిపి వర్సెస్ టిడిపి
- కడప ఎంపీ అవినాష్‌రెడ్డి హౌస్ అరెస్టు
- వేములలో ధ్రువీకరణ పత్రాల చింపివేత
- మీడియా ప్రతినిధులపై దాడి

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల రాజకీయం వేడెక్కింది. ఈ నెల 14న నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనడానికి నీటి పన్ను పత్రాల కోసం వెళ్లిన వైసిపి మద్దతుదారులతో పాటు మీడియాపై టిడిపి దాడికి పాల్పడడం ఆందోళన కలిగించింది. అప్రజాస్వామిక ఘటనల పరిశీలనకు వెళ్లడానికి ప్రయత్నించిన ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసిన తరహాలోనే శాసనమండలి మాజీ ఉపాధ్యక్షులు ఎస్‌వి సతీష్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాజకీయంగా ఆశించిన ప్రయోజనంలేని ఎన్నికల్లోనే ఇంతటి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంటే, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎటువంటి తరహా రాజకీయం నడుస్తుందోననే ఆందోళన నెలకొంది.

అవినాష్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/పులివెందుల టౌన్/వేముల

జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల రాజకీయం ఉద్రిక్తతలకు నిలయంగా మారింది. ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రకటించింది. గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖ యంత్రాంగాలు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలోని 206 సాగు సంఘాలకు ఎన్నికల నగారా మోగింది. ఎన్నికల్లో పాల్గొడానికి అవసరమైన నోడ్యూ సర్టిఫికెట్ల కోసం వెళ్లిన వేముల మండలానికి చెందిన వైసిపి మద్దతుదారులతో టిడిపి మద్దతుదారులు ఘర్షణకు పాల్పడడం ఉద్రిక్తతలకు తావిస్తోంది. ఈ నెల 14న నాటి సాగునీటిసంఘాల ఎన్నికల్లో పాల్గొనడానికి నీటిపన్ను సర్టిఫికెట్లు అవసరం. ఇటువంటి కీలక సర్టిఫికెట్ల మంజూరు నిమిత్తం సచివాలయాలకు వెళ్లాల్సి ఉంది. సచివాలయాల్లో విఆర్ఒలు అందుబాటులో లేకపోవడంతో తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేముల తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లిన ఇ.సి.మహేశ్వర్‌రెడ్డి వైసిపి మద్దతుదారులతో అధికార పార్టీ మద్దతుదారులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం చర్చనీయాంశంగా మారింది. వైసిపి మద్దతుదారుడు మహేశ్వర్‌రెడ్డి చేతుల్లోని ధ్రువీకరణ పత్రాలను టిడిపి మద్దతుదారులు లాక్కొని చించివేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంతటితో ఆగకుండా మీడియా ప్రతినిధులపై దాడికి తెగబడడం ఆందోళన కలిగిస్తోంది. ఇటువంటి విపరీత పోకడల నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్టు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తతలకు దారి తీసింది. వైసిపి మద్దతుదారుల, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అంతకుముందే శాసన మండలి డిప్యూటీ మాజీ ఛైర్మన్ ఎస్.వి.సతీష్‌రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అప్రజాస్వామిక పద్ధతులతో ఎన్నికలు నిర్వహించడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదనే వాదన వినిపిస్తోంది. దౌర్జన్యకర పద్ధతులకు స్వస్తి పలికి ఏకపక్షంగా నామినేట్ చేసుకుని ఉంటే సరిపోయేదనే విమర్శ వినిపిస్తోంది. మీడియా ప్రతినిధులపై దాడికి నిరసనగా ఎఎస్‌పిని ప్రకాష్‌బాబును కలిసి మీడియా సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేయడం గమనార్హం. ఏదేమైనా ఇటువంటి తరహా అప్రజాస్వామిక విధానాలు ఎవరికీ మేలు చేయవనే సంగతిని పాలకులు గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలి

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రజాస్వామ్య బద్ధకంగా ఎన్నికలు నిర్వహించాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి పేర్కొన్నారు. నీటి సంఘాలకు ఎన్నికలు నేపథ్యంలో వేంపల్లె మండలంలో 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వేంపల్లెలో ఉన్న సతీష్ రెడ్డికి పోలీసులు నోటిసు ఇచ్చి హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీటి సంఘం ఎన్నికల్లో ప్రత్యేకమైన పరిస్థితులు కనిపిస్తున్నట్లు చెప్పారు. బయటికి వెళ్లకుండా తనకు పోలీసులు నోటీసులు ఇచ్చారని చెప్పారు. నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయాలంటే నీటి పన్ను కట్టాలని ప్రభుత్వం నిబంధన పెట్టడం దారుణమన్నారు. రైతు భరోసా కింద రైతులకు రూ. 20 వేలు ఇవ్వకపోగా నీటి పన్ను రైతుల నెత్తిన రుద్దిన్నట్లు చెప్పారు. రైతు వ్యతిరేక కార్యక్రమాలు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వేముల మండల కేంద్రంలో నీటిసంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్‌కు వెళ్లిన సాక్షి టివి కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డి పై రాళ్లతో దాడి చేయడం హేమమైన చర్య అని మీడియా ప్రతినిధులు పేర్కొన్నారు. శుక్రవారం అడిషనల్ ఎఎస్‌పి ప్రకాష్ బాబు కలిసి వినతి పత్రం అందజేశారు. కవరేజ్‌లో ఉన్న రిపోర్టర్లపై దాడి చేయడం, కెమెరా, 4జి లైవ్ కిట్టు ధ్వంసం చేయడం పై ఏ ఎస్ పి దృష్టికి తీసుకువచ్చారు. సాక్షి మీడియా ప్రతినిధులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మీడియా దాడులు చేయడం అంటే ప్రజాస్వామ్యం పై నమ్మకం లేకపోవడమే అని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు, పాత్రికేయులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. **ముద్దనూరు** వేముల మండలంలో సాగు నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ కవరేజ్ వెళ్లిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల విలేకరులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల విలేకరులు తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో క్రిష్ణ మోహన్, ఏసుదాసు, సుధాకర్,నంద పాల్గొన్నారు. **వేంపల్లె :** వేములలో జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండల జర్నలిస్టులు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడికి నిరసనగా వేంపల్లె మండల జర్నలిస్టులు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ హరినాథ్ రెడ్డిని జర్నలిస్టులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

కష్టాల కడలిలో రైతులు

- వర్షాలతో తడిసిన వరి ధాన్యం
- కాపాడుకునేందుకు అవస్థలు
- ప్రభుత్వమే ఆదుకోవాలంటూ వేడుకోలు

విశ్వనాథపురం గ్రామం వద్ద పూర్తిగా నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన రైతులకు అడుగడుగునా కష్టాలే ఎదురవుతున్నాయి. సాగు సందర్భంలో అధిక ధరలున్న ధాన్యం ప్రస్తుతం నూర్పిడి దశకు వచ్చే సమయానికి క్రమేపీ తగ్గుతూ వచ్చాయి. నూర్పిడి చేద్దామనుకున్న సమయంలో వరుసగా తుపాన్లు వరి రైతులను ఇబ్బందులకు గురి చేశాయి. వారంలో నాలుగు రోజులు పాటు ఫెంగల్ తుపాను తాకిడికి వరి పంట నేలకొరిగి పూర్తిగా తడిచాయి. వారం తిరగకముందే మరో తుపాన్ ప్రభావం తారసపడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి పంట రోజు రోజుకూ నేలకొరవడం అధికమవుతుంది. నూర్పిడి చేసిన ధాన్యాన్ని ముసురుతో ఎక్కడ ఇబ్బందులు పడతామో అన్న ఆందోళనలతో రైతులకు నిద్ర కరువైంది. టార్పాలిన్ పట్టలు కప్పి ఉంచితే ధాన్యం దెబ్బతింటుందని ఆరబెట్టడం, చినుకులు పడితే వాటిని మళ్లీ కప్పి ఉంచడం పనిగా మారింది. పంట పొలాలలో ధాన్యాన్ని ఉంచితే ఇబ్బందులు ఎదురవుతాయని రోడ్ల వెంబడి ఖాళీ ప్రదేశాలలో ఆట స్థలాల్లో ధాన్యాన్ని తరలిస్తూ మరింత ఆర్థిక భారాన్ని రైతులు మోయాల్సి వస్తుంది. వరి పంట నేల కొరగడంతో నూర్పడి చేసేందుకు సాధారణ సమయం కన్నా ఒక గంట అదనంగా పడుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటే ధాన్యం కొనుగోలు చేసేవారు ముందుకు రావడం లేదు. మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా చాపాడు, మైదుకూరు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం మండలాల్లో ఖరీఫ్ సీజన్ లో 50 వేల ఎకరాల వరకు వరి పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వరి ధాన్యం ధరలు ఎనిమిది బస్తాలు రూ.12వేలు మాత్రమే పలుకుతున్నాయి. మైదుకూరు ప్రాంతంలో రోడ్ల పైన ఖాళీ ప్రదేశాలలో ఎక్కడ చూసినా వరి ధాన్యాన్ని కుప్పలుగా పోసి ఉంచి టార్పాలిన్ పట్టలు కప్పి ఉంచారు. తుపాన్ ప్రభావం పోయి ఎండలు వస్తే తప్ప వరి రైతుల కష్టాలు తప్పే పరిస్థితి కనపడటం లేదు.

మైదుకూరు వద్ద వరి ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

సబ్ స్టేషన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

- ఎపి ఇఆర్‌సి చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్

ప్రజాశక్తి -కడప

స్థల సేకరణలు పూర్తి చేసి కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి) చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్ ఆదేశించారు. శుక్రవారం కడపకు వచ్చిన ఆయన తొలుత కడప నగరంలోని పాత కడప సబ్‌స్టేషన్‌ను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం కడప విద్యుత్ భవన్‌లోని సమావేశ హాలులో ఎపిఎస్‌పిడిసిఎల్‌లోని కడప, అన్నమయ్య జిల్లాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థల సేకరణలు పూర్తి చేసి కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించడానికి అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాణాల ప్రకారం ప్రజలకు అందించే విద్యుత్తు సేవలు నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు తిరిగి వారికి పరిహారం చెల్లించే విధంగా ప్రమాణాలు తీసుకొచ్చామని తెలిపారు. వీటిని దృఢంగా ఆచరణలో పెట్టి ప్రజలకు అందించే విద్యుత్ సేవల్లో జాప్యం లేకుండా వారి సంతృప్తికరస్థాయి సేవలు అందించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సహరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి ఉద్యోగి సంస్థకు, వినియోగదారులకు మధ్య వారధిగా ఉంటారని, జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉంటూ, విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాలని తెలిపారు. డిస్కం, ఎపి ట్రాన్స్‌కో వారు ఎప్పటికప్పుడూ సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేసుకుని అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని ఆదేశించారు.. సమావేశంలో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ వరకుమార్, ఏపీ ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ కృష్ణమ నాయుడు, ఎపిఇఆర్‌సి ఒఎస్‌డి ముణి శంకరయ్య, ఉమ్మడి జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ, అకౌంట్ ఆఫీసర్ మధు, డిస్కం, ఎపి ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న ఠాకూర్ రామ్‌సింగ్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - కడప

కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులలో భాగంగా ఈనెల 12న నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపే స్తున్నట్లు కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ నాయక్ ఒక ప్రకట నలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని తెలిపారు. ముత్రాస్‌పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్య నగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి భార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెస్‌లో గుకేశ్ ఘన విజయం

ప్రజాశక్తి - కడప

ఆనంద వేడుకలు జరుపుకుంటున్న చెస్ క్రీడాకారులు

ఇండియన్ గ్రాండ్ మాస్టర్ గుకేశ్ 18వ వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్‌గా విజయం సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం కడపలోని అనీస్‌దర్బారి చెస్ అకాడమీలో చెస్ ఆటగాళ్లు, కోచ్‌లు, చెస్ అభిమానులు కేక్ కట్ చేసి ఆనంద వేడుకలు నిర్వహించారు. అనీస్ దర్బారి మాట్లాడుతూ గుకేశ్ ప్రతిభ గురించి క్రీడాకారులకు వివరించారు. '2016లో కడపలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ అండర్-15 అధికారిక చెస్ ఛాంపియన్‌షిప్‌లో పదేళ్ల గుకేశ్ కృష్ణా జిల్లాను ప్రాతినిధ్యం వహించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. చిన్న వయసులోనే చెస్ వరల్డ్ ఛాంపియన్ కైవసం చేసుకోవడం గర్వకారణమన్నారు. ఈ వేడుక గుకేశ్ అసాధారణ విజయాన్ని గౌరవించడమే గాక అకాడమీలో ఉన్న యువ చెస్ ఆటగాళ్లకు ప్రేరణ కలిగించింది అని తెలిపారు. గుకేశ్ భవిష్యత్తులో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నృత్యంలో 'బిపిఎస్' విద్యార్థుల ఘనత

ప్రజాశక్తి - బద్వేలు

ఈనెల 8న నెల్లూరు పట్టణంలో ఏకధాటిగా 10 గంటల పాటు నిర్వహించిన నిర్విరామ కూచిపూడి నృత్య ప్రదర్శనలో బద్వేల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారని పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ క్రాంతి కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ గానుగపెంట హనుమంత రావు, యోగి వేమన యూనివర్సిటీ మెంబర్ కొండపల్లి సుబ్బారావు విచ్చేసి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు, సాంప్రదాయ నృత్యాలలో శిక్షణ తప్పనిసరిగా ఇవ్వాలని, అప్పుడే వారికి మానసిక లాభం కలుగుతుందని, ఇంతటి ఘనత సాధించినందుకు గర్వంగా ఉందని చెప్పారు. ఇంతటి అవార్డు సాధించడానికి ప్రధాన కారణభూతులైన డాన్స్ మాస్టర్ సతీష్‌ను, విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న అతిథులు

గ్యాస్ సబ్సిడీ కోసం ఎదురు చూపు!

- రాయితీ కొందరికేనా ..?
- నెలరోజులైనా పడని సబ్సిడీ డబ్బులు
- పనిచేయని టోల్‌ఫ్రీ నంబర్
- ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-వేంపల్లె

అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లును ఉచితంగా ఇస్తూ దీపావళి రోజు ఉచిత సిలిండర్ల పథకాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో గ్యాస్ బుక్ చేసుకొన్న వినియోగదారులకు దీపం-2 పథకం కింద ఖాతాలో జమ చేస్తానని చెప్పడంతో సబ్సిడీ కోసం వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. కొందరికి మాత్రమే సబ్సిడీ పడగా, మరి కొందరికి రూ 47.50 మాత్రమే బ్యాంకు ఖాతాలో పడింది. గ్యాస్ తీసుకొని నెలరోజులైనా వినియోగదారుల బ్యాంకు ఖాతాలో రాయితీ డబ్బులు పడలేదు. మొదటి దశలోనే గ్యాస్ బుక్ చేసుకున్నా రాయితీ పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. దీపం-2 పథకం అమలులో సమస్యలు వెంటాడు తున్నాయి. గ్యాస్ రాయితీ సొమ్ము పడనివారు అనేక మంది ఉన్నారు. పులివెందుల డివిజన్ వ్యాప్తంగా 48,229 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అందులో దీపం పథకం కింద 33,129, ఉజ్వల్ పథకం కింద 15,060 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 26,350 మంది మాత్రమే ఇకెవైసి చేయించుకున్నారు. 21879 మంది ఇంకా చేయించుకోలేదు. గ్యాస్ కనెక్షన్లు పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ లింకు చేయించుకోవాల్సి ఉంది. ఇకెవైసి చేయించుకున్న వినియోగదారులకు రాయితీ సొమ్ము ట్రోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేసినా పరిష్కారం కావడం లేదు. ఒకొక్క సారి ట్రోల్ ఫ్రీ నెంబర్ పని చేయడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. సిలిండర్ అందిన కొద్ది రోజుల వ్యవధిలో కొందరి ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. కొందరికి వారం రోజుల తర్వాత పడుతున్నాయి. ఇంకొందరికి నెల రోజులైనా రాయితీ సొమ్ము జమ కాలేదు. సకాలంలో రాయితీ సొమ్ము జమ కాక పోవడంతో ఉచిత గ్యాస్ తమకు వర్తించదన్న ఆందోళనలో వినియోగదారులు ఉన్నారు. గ్యాస్ రాయితీ జమ కాక నిరాశ చెందుతున్నారు. సిలిండర్ అందిన 48 గంటల్లో రాయితీ సొమ్ము వినియోగదారుల ఖాతాలో జమ అవుతుందని ప్రభుత్వం చెప్పింది. కాని అమల్లో మాత్రం లోపాలు ఉన్నాయి. పిర్యాదు చేస నా ఫలితం లేదని వినియోగదారులు అంటున్నారు. గ్యాస్ రాయితీ సొమ్ము రూ 807 తమ ఖాతాలో జమ అయినట్లు సమాచారం రాక పోవడంతో రోజు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు మాత్రం గ్యాస్ సిలిండర్లు తీసుకున్న వారందరికి రాయితీ సొమ్ము జమ అవుతుందని చెప్పుతున్నారు. ఎడాదిలో నాలుగు నెలలకు ఒక్కటి చొప్పున మూడు సిలిండర్లు ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుంది. అందులో భాగంగా తొలి దశలో సిలిండర్‌కు రాయితీ సొమ్ము రాక పోవడంతో మిగిలిన రెండు సిలిండర్లకు డబ్బులురావాన్న నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీని వెంటనే లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంత వరకూ సబ్సిడీ పడలేదు

అక్టోబర్ 30వ తేదీన గ్యాస్ బుక్ చేశాం. డబ్బులు చెల్లించి సిలిండర్ తీసుకున్నాం. ఇంతరవకూ సబ్సిడీ డబ్బులు పడలేదు. టోల్‌ఫ్రీ నంబర్ పనిచేయడం లేదు. రోజూ బ్యాంకుల చుట్టు తిరు గుతున్నాను. అయినప్పటికీ సబ్సిడీ డబ్బులు పడలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీ వేయాలి. లేకుంటే ప్రభుత్వం ప్రజల్లో నమ్మకం పోతుంది.

- సిరాజున్నీషా, వేంపల్లి,

సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

నిరుపేదలకు, దళిత గిరిజనులకు చట్టాలు అందని ద్రాక్షల మారాయని, ఈ క్రమంలో 'చట్టం అందరికి సమానమేనా?' అనే సదస్సు ఈ నెల 15న ఆదివారం ఉదయం 10 గంటలకు హరితహోటల్‌లో నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో చట్టాలు అమలు తీరు మరి అధ్వానంగా మారిందని, బిజెపి ప్రభుత్వంలో భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తే గొంతు నొక్కేస్తున్నారని, ప్రొఫెసర్ సాయిబాబాను అమానుషంగా 10 సంవత్సరాలు పాటు బెయిల్ ఇవ్వకుండా ఆయన్ను మానసికంగా హింసించి వేధించారని వారు పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాస్వామ్య వాదులు మేధావులు న్యాయవాదులు ఉపాధ్యాయులు ఉద్యోగులు యువకులు, విద్యార్థులు పట్టణ పౌరులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష ప్రజా సంఘాల నాయకులు, విశ్రాంత పరిశ్రమల అధికారి గోపాల్, ఇంజినీర్ గుర్రప్ప, సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి, ఎఐటియుసి నాగ సుబ్బారెడ్డి, సిఐటియు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, పౌర హక్కుల సంఘం వెంకటేశ్వర్లు, జన విజ్ఞాన వేదిక నాయకులు శివరాం, బుద్దిస్ట్ సొసైటీ కుమారస్వామి పాల్గొన్నారు.

ఐదవ రోజుకు న్యాయవాదుల దీక్షలు

ప్రజాశక్తి - కడప

జీవో నంబర్ 145ను తక్షణం ఉపసంహరించుకోవాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం దిగివచ్చేంత వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కడప నుంచి తిరుపతికి ఫాస్ట్ ట్రాక్ కోర్టును బదిలీ చేయడాన్ని నిరసిస్తూ కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కడప జిల్లా కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరుకున్నాయి దీక్షల్లో సి.హెచ్. ఎం.జాషువా, అయ్యావారప్ప, చంద్రశేఖర్, సుధారాణి, సురేష్ కూతురు ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

దీక్షలు నిర్వహిస్తున్న న్యాయవాదులు

సదస్సులో అర్జీలు నమోదు చేయించుకుంటున్న రైతులు

రెవెన్యూ సదస్సులకు ఆదరణ కరువు

ప్రజాశక్తి - చాపాడు

ప్రస్తుతం గ్రామాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులకు రైతుల నుంచి ఆదరణ కరువైంది. సమావేశాలకు 20 నుంచి 30లోపు మాత్రమే అర్జీలు వస్తున్నాయి. దీంతో రెవెన్యూ అధికారులు మధ్యాహ్నానికి సమావేశాలను ముగిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులలో రైతులు నిమగ్నమవడంతో సమావేశాలకు హాజరు కావడం లేదని తెలుస్తుంది. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత సదస్సులు నిర్వహించి ఉంటే ఉపయోగకరంగా ఉండేదని రైతులు పేర్కొంటున్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో తహశీల్దార్ రామకుమారి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేవలం 22 మంది రైతుల నుంచి మాత్రమే అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపుతామన్నారు. రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సదస్సులను ఏర్పాటు చేసిందన్నారు. సమస్యలు ఉన్న రైతులు సమావేశాలకు వచ్చి అర్జీ ఇవ్వాలన్నారు. ఈ సదస్సుల దృష్టికి సమస్యలను తీసుకువచ్చే ప్రతి రైతుకు రశీదు ఇచ్చి పరిష్కారం చూపుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి, డిటి కృష్ణారెడ్డి, రీసర్వే డిటి నారాయణస్వామి, టిడిపి నాయకులు లోకేశ్వర్ రెడ్డి, ఆదేం చంద్రశేఖర్ రెడ్డి, సర్వేయర్ లక్ష్మీ నారాయణ, విఆర్ఒలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని తహశీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని విశ్వనాథపురం సచివాలయంలో రెవెన్యూ సదసు నిర్వహించారు. కార్యక్రమంలో మండల సర్వే నాగభూషణ్ రెడ్డి సీనియర్ అసిస్టెంట్ యూనస్ భాష రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆదిరాజు విఆర్ ఒ లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కలిసి పనిచేయాలి

ప్రజాశక్తి - చాపాడు

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు ఎంపిక చేసుకొని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిడిఒ వీరశేఖర్ తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాలలో స్థానికంగా అందుబాటులో ఉండే వనరులను గుర్తించి వాటి ద్వారా అభివృద్ధి కృషి చేయాలన్నారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సర్పంచుల సహకారంతో అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. అనంతరం ట్రైనర్ల సిబ్బందికి గ్రామ పంచాయతీల అభివృద్ధి పై సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మైదుకూరురూరల్:** ఎపి పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన క్రింద గ్రామ సర్పంచ్లకు గ్రామీణ ప్రాంతాలలో పని చేసే పంచాయతీ కార్యదర్శులకు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు శుక్రవారం రెండవ రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు - 9, వాటి సాధన నిమిత్తం సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలతోనే సాధ్యమన్నారు. 2030 నాటికి అలాగే 2047 నాటికి సాధించాల్సిన లక్ష్యాలపై సమగ్రమైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్డి ఎం.సుధాకర్, ట్రైనర్లు సురేష్, రెడ్డెయ్య, వెలుగు ఎపిఎం జయరాజ్, ఉపాధి ఎపిఒ రామచంద్రా రెడ్డి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఓబులమ్మ శ్రీదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ భరత్ కుమార్రెడ్డి పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె:** స్థానికంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు ఎంపిక చేసుకొని గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపిడిఒ పి. కతాయబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సభ భవనం కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** సర్పంచులు, అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని ఎంపిడిఒ సభా భవనంలో రెండో రోజు సర్పంచ్ల శిక్షణ తరగతుల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీరు, వీధి దీపాలు, శానిటేషన్, ఇతర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయాలన్నారు. పంచాయతీ పరిధిలో అభివృద్ధి జరగాలంటే సర్పంచ్ ఎంతో కీలకమన్నారు. కార్యక్రమంలో ఈవో పి ఆర్ డి పద్మనాభ రెడ్డి, వెలుగు ఏపిఎం మంజునాథ పాల్గొన్నారు. **చక్రాయపేట :** సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టాలని ఎంపిడిఒ రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండవ రోజు స్థానికంగా సుస్థిర శిక్షణ కార్యక్రమం ముగిసింది. కార్యక్రమానికి గ్రామ సర్పంచులకు, మండలంలోని సచివాలయ అన్ని శాఖల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు డిఎల్ఒ విజయ కుమార్ నాయక్, శ్రీహరి నాయుడు, మస్తానయ్య శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా సుస్థిర అభివృద్ధిలో భాగంగా పేదరిక నిర్మూలన, వైద్య ఆరోగ్యం, లింగ వివక్షత, ఆకలి బాధలు తగ్గించి అందరికీ పోషకాహారం అందించాలని అందరికీ ఆరోగ్యం కలిగించాలని, ఉపాధి సాంఘిక సమానత్వం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామని ఎంపిడిఒ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఒఎ -2 రవికుమార్, ఎఇపిఆర్ రాజశేఖర్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ శంకర్ మూర్తి పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపిడిఒ రాజశేఖర్రెడ్డి

క్రైం కార్నర్

స్కూటర్ను ఢీ కొన్న లారీ .. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలోని గంగాదేవిపల్లె వద్ద శుక్రవారం స్కూటర్ను లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం మండలంలోని గంగాదేవి పల్లికి చెందిన మల్లికార్జున, రామచంద్ర కలిసి స్కూటర్లో రోడ్డు దాటుతుండగా తాడిపత్రి నుంచి ముద్దనూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో మల్లికార్జునకు ఎడమకాలు విరిగింది. రామచంద్ర తల, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. మల్లికార్జున పరిస్థితి విషమంగా ఉంది. గాయపడిన వారిని 108 సిబ్బంది మహేష్, సుబ్రమణ్యం చికిత్స నిమిత్తం వాహనంలో ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు.

ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందే

సూపర్ సిక్స్ హామీలన్నింటినీ తక్షణం నెరవేర్చాలి
కడప నగరంలో వైసిపి నాయకుల ర్యాలీ
జెసికి వినతి పత్రం అందజేత

ప్రజాశక్తి - కడప

ప్రజలకు రైతులకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల కాలంలో రైతులను ఏమాత్రం ఆదుకోలేదని, రైతులను, ప్రజలను, మహిళలను దగా చేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్బాషా, నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఎమ్మెల్సీలు గోవిందరెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, రఘురామిరెడ్డి, సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. అన్నదాతకు అండగా వైసిపి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కడప నగరంలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత వైసిపి జిల్లా కార్యాలయంలో వై.ఎస్.రాజశేఖర్రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి జిల్లా కార్యాలయం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి కడప కలెక్టరేట్ కు చేరుకున్నారు. కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ. 20 వేలు ఇవ్వాలన్నారు. సూపర్ సిక్స్ హామీలను తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందేనని అన్నారు. దళారీ వ్యవస్థను తొలగించాలని పేర్కొన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులు ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. పెన్షన్ తప్ప మరొక పథకాన్ని అమలు చేయలేదని అన్నారు. రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసి రైతులను మోసం చేసిందన్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవన్నారు. దీంతో రైతన్నల పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. నీటి సంఘాల ఎన్నికల్లో బెదిరింపులకు పాల్పడుతున్నారు అన్నారు. అడ్డుకున్న ఎంపీని నిర్బంధించడం సరికాదన్నారు. పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలి అని తాము కోరుతున్నామన్నారు. అధికారం కోసం ఎన్ని అబద్దలైన చెప్పగల సమర్థుడు చంద్రబాబు నాయుడు అని విమర్శించారు. రాష్టంలో ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చెయ్యలేదు అన్నారు. రైతుల్లో వ్యతిరేకత ఉందని పవన్ కల్యాణ్ ముందే గ్రహించి సూచనలు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు వైసిపి సీనియర్ నాయకులు, గిరిధర్రెడ్డి, వల్లంబాయ్ రుషికేశవరెడ్డి, జమ్మలమడుగు, ముద్దనూరు, మైలవరం మండలాల వైసిని నాయకులు కమలాపురం వైసిపి ఇన్ఛార్జి నరేన్ రామాంజుల రెడ్డి, నగర అనుబంధ సంఘ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జెసికి వినతి పత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న బండి జకరయ్య

ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త బండి జకరయ్య అన్నారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధ, గురువారాలలో అమరావతిలో నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవసాయ అధికారుల నుద్దేశించి ప్రజెంటేషన్ బాగా ఉంది కానీ ఔట్ కం లేదని వ్యాఖ్యనించారన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో వేగం లేదని సాక్షాత్తు చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆరోపించారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ నెల నుంచి నవంబర్ వరకు 1.69 లక్షల ఫిర్యాదులు వస్తే వాటిలో 30 శాతం పెండింగ్లో ఉన్నాయని చెప్పారు. మండల స్థాయి అధికారులు, గ్రామ, వార్డు సచివాలయాల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూ వివాదాలపై రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నాటికి 98 వేల ఫిర్యా దులు అందాయన్నారు. దీన్ని బట్టి చూస్తే మండల స్థాయి అధికారులు పనిచే యనట్టుగా భావించాలని ఆయన అన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తే వాస్తవాలు తెలుస్తాయని అధికారులకు సూచించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు రఫీఖ్ ఖాన్ పాల్గొన్నారు

వేడుకలకు సిద్ధమైన కాశినాయన జ్యోతి క్షేత్రం

నేటి నుంచి జ్యోతి క్షేత్రంలో ఆరాధనోత్సవాలు

- ముస్తాబైన ఆలయం

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని జ్యోతి క్షేత్రంలో వెలసిన కాశి నాయన 29వ ఆరాధనకు ఆలయం అంగ రంగ వైభవంగా ముస్తాబైంది. శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. 28 సంవత్సరాల నుంచి ఎంతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ వారు తీసుకుంటున్నారు. ఇక్కడ నిత్య అన్నదానం ప్రత్యేకత. రోజూ ఎంతోమంది మంది యాత్రికులు, అనాథలకు అన్నదానం చేస్తారు. ఆరాధన సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుస్తాయి. ఆరాధన సందర్భంగా నర్సాపురం ఎస్ఐ హనుమంతు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-పులివెందుల టౌన్ : వారాంతపు సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.45 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు శిల్పారామంలో నిర్వహిస్తామని పరిపాలన అధికారి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తలుపుల రామమోహన్, శ్రీ లక్ష్మీ శ్రీనివాస జ్యువెలర్స్, పులివెందుల వారి సౌజన్యంతో డాక్టర్. ఆర్. మానస గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్-2 టైమ్స్, నంది అవార్డు గ్రహీత, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్-2 టైమ్స్ ,నాట్య మయూరి, నృత్య కౌముది, నృత్య ఝరి,నాట్య సార్వభౌమ,గురు శ్రేష్ఠ అవార్డు గ్రహీత, గురు రత్నాకర వారి శిష్య బృందంచే ప్రత్యేక నృత్య ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. వీరితో పాటు గురువు చందు డ్యాన్స్ అకాడమీ కూడా ప్రదర్శన చేయబోతున్నారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర స్థాయి చెస్ ర్యాంకింగ్ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయం సాధించినట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. నంద్యాలలోని కృష్ణ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 12న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారని, ఇందులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ చూపినట్లు చెప్పారు. అండర్-14 బాలికల విభాగంలో టి. తనుశ్రీ మూడవ ర్యాంకును సాధించినట్లు చెప్పారు. అలాగే అండర్-16 ఓపెన్ కేటగిరీలో టి. కౌశిక్ అనే విద్యార్థి 6వ ర్యాంకును సాధించి తన ప్రతిభను చాటారన్నారు. శుక్రవారం చెస్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు కరస్పాండెంట్ అభినందించారు. మరింత క్రీడా పోటీల్లో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కోరారు.

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

సాగునీటి ఎన్నికల్లో కనిపించని

వైసిపి మద్దతుదారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో పులివెందుల బ్రాంచ్ కెనాల్(పిబిసి) ఆయకట్టు పరిధిలో నిర్వహించబోయే సాగునీటి ఎన్నికలలో ఆయకట్టు రైతుల నీటి పన్ను చాలా కీలకంగా మారింది. ప్రాదేశిక సభ్యులుగా నిలబడడానికి ఆసక్తి ఉన్న రైతులు, వారిని బలపరచడానికి రైతులు తప్పకుండా నీటి పన్ను చెల్లించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి టిడిపి మద్దతుదారులు తహశీల్దార్ కార్యాలయానికి భారీ ఎత్తున చేరుకొని తమ మద్దదారులతో నీటి పన్ను చెల్లించారు. వైసిపి చెందిన మద్దతుదారులు నీటి పన్ను కట్టడానికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందుల కావడంతో పోలీసులు తహశీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు ఖాదర్బాషా

మాజీ ఎమ్మెల్యే విమర్శలు అర్థరహితం

ప్రజాశక్తి -కమలాపురం టౌన్

రైతు సమస్యలపై మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్రెడ్డి కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం అర్థరహితమని, కడప జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షులు ఖాదర్బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 1,50, 000 లోపు రుణాన్ని నాలుగు విడతల్లో రుణమాఫీ చేసిన ఘనత టిడిపి ప్రభుత్వమేదని పేర్కొన్నారు. ఐదు ఎకరాల లోపు అర్హులైన రైతులందరికీ 90 శాతం సబ్సిడీతో సూక్ష్మ నీటి పరికరాలు, సూక్ష్మ పోషకాలు అందించామని పేర్కొన్నారు. 2024 నుండి కూడా అర్హులైన రైతులందరికీ 90 శాతం సబ్సిడీతో పది ఎకరాలలో రైతులకు కూడా సూక్ష్మ నీటి పరికరాలు అందించబోతున్నామని ఖాదర్ భషా తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, జంపాల నరసింహారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సుబ్బారెడ్డి చెన్న కృష్ణారెడ్డి అజంతులాపాల్గొన్నారు

ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

టిసిఎస్ కంపెనీలో ఉద్యోగాలకు

జెఎన్టియు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జెఎన్టియు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులు టిసిఎస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఆచార్య డి.విష్ణువర్ధన్ తెలిపారు. టిసిఎస్కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో సిఎస్ఇ విభాగం నుంచి 10 మంది, ఇసిఇ విభాగం నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య కే. శేష, మహేశ్వరమ్మ, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, వివిధ విభాగాధిపతులు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కదిరి సిఐపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పులివెందుల రూరల్ : కదిరి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న సిఐ నారాయణరెడ్డి, రామకృష్ణపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పులివెందుల న్యాయవాదులు నరసింహారెడ్డి, కిషోర్, ప్రతాపరెడ్డి, గజేంద్రనాథరెడ్డి, తులసి రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవాదులు కోర్టు వద్ద విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు కదిరి సిఐపై చర్యలు తీసుకోవాలని డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి మురళి నాయక్కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల 12న లాయర్ గజేంద్ర క్లయింట్కు నోటీసు పంపించారన్నారు. నోటీసు ఫోర్జరీ చేశారని, సిఐ న్యాయవాదికి ఫోన్ చేసి చెప్పారని, ఫోర్జరీ విషయం తనకు తెలియదని సదరు న్యాయవాది గజేంద్ర చెప్పారని పేర్కొన్నారు. దీంతో సిఐనారాయణరెడ్డి న్యాయవాదిపై కేసు నమోదు చేస్తానని బెదిరించారని తెలిపారు. తనకు తెలిసిన వ్యక్తికే నోటీసు పంపుతావా, నీ అంతు చూస్తానని బెదిరించారని వారు చెప్పారు. ఈ విషయంపై కదిరి సిఐపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మీడియాపై దాడి హేయం

ప్రజాశక్తి - బద్వేలు : రాష్ట్రంలో మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని మీడియాకు రక్షణ కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. శుక్రవారం స్థానిక బద్వేల్ పట్టణంలోని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష -కార్యదర్శులు యస్. మస్తాన్ షరీఫ్,యస్.కె.ఆదిల్లతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా ఉందని అలాంటి మీడియాకు సమస్యలను ప్రశ్నించే హక్కు ఉందని,రాజ్యాంగంలో వాక్ స్వతంత్ర్యం ఉందని గుర్తు చేశారు.

ఆర్డిఒ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించాలి

-ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగులో పరిపాలన రాజ్యాంగేతర శక్తుల ఆధీనంలో ఉందని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో రైతులతో కలిసి సాగునీటి ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించాలని వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగులో నియంత పాలన సాగుతుందన్నారు. తహశీల్దార్, విఆర్ఒలు, అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి భయపడి సెల్ ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుంటే డిఎస్పి, ఆర్డిఒలకు గురువారం రాత్రి వినతి పత్రాలు సమర్పించామని, అయినా వారి తీరు మారలేదని వాపోయారు. సాగునీటి ఎన్నికల కోసం గ్రామాలలో టాంటాం వేయించి ప్రస్తుతం ఎలక్షన్లు ఏకపక్షంగా చేయాలని చూస్తున్నారన్నారు. కూటమి నాయకులు విఆర్ఒలను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని వారు ఇప్పటివరకు ఎక్కడున్నారో తెలియడం లేదని ఆరోపించారు. దౌర్జన్యంగా తీసుకెళ్లడం దారుణం అన్నారు. తీసుకెళ్లిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిఎస్పి కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో పి. గిరిధర్ రెడ్డి జమ్మలమడుగు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముల్లా జానీ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శివ గురవి రెడ్డి, చిన్న ముడియం కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి, ఉప్పలపాటి యోబు, గూడెం చెరువు నాగేశ్వర్రెడ్డి, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, మహేశ్వర్ రెడ్డి, మార్బుల్ శీను, భాస్కర్ రెడ్డి, సురేష్, మైలవరం పెద్దమడియం జమ్మలమడుగు వైసిపి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో వర్క్షాప్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్రెడ్డి

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశా లలో శుక్రవారం అడ్వాన్స్డ్ సాఫ్ట్వేర్ డెవలప్మెంట్ ప్రాక్టీసెస్ అండ్ ఆర్కిటెక్చర్ అనే అంశంపై బిటెక్ సిఎస్ఇ విద్యార్థులకు డిపార్టుమెంట్ ఐఎస్టిఇ స్టూడెంట్ చాప్టర్ కింద సీనియర్ సాఫ్ట్వేర్ ఇంజినీర్ సీమెన్స్ టెక్నాలజీ, సర్వీస్ ప్రయివేట్ లిమిటెడ్ బెంగళూరు యుగంధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒకరోజు వర్కుషాప్ నిర్వహించింది. వర్కుషాప్లో భాగంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ సర్వీస్ డిస్కవరీ, లోడ్ బ్యాలెన్సింగ్, ఎపిఐ గేట్వే, ఫాల్ట్ టాలరెన్స్, డిస్ట్రిబ్యూషన్లో ఉపయోగపడే స్ప్రింగ్ బూట్తో మైక్రోసర్వీసెస్ ఆర్కిటెక్చర్లను వంటి ఆధునిక అనువర్తనాల్లో డిజైన్ నమూనాల గురించి కూడా ఆయన వివరించారు.ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి మాట్లాడుతూ అధునాతన సాఫ్ట్వేర్ డెవలప్ మెంట్ ఆర్కిటెక్టర్ పాత్ర, సాఫ్ట్వేర్ పరిశ్రమలలో వాటి ప్రాముఖ్యత గురించి స్ఫూర్తిదాయకమైన కీలకోపన్యాసం చేశారు. సిఎస్ఇ హెచ్ఒడి డా.వై. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ వర్కుషాప్ వల్ల డిజైన్ నమూనాలను ఉపయోగించి మాడ్యులర్, పునర్వినియోగపరచదగిన, పరీక్షించదగిన కోడ్ను ఎలా రూపొందించాలి, అమలు చేయాలి కంటెయినర్రైజేషన్ భావనలను, సాంప్రదాయ వర్చువలైజేషన్ కంటే దాని ప్రయోజనాలను వివరించడానికి ఉపయోగప డుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. వెంకటేశ్వర్ రెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.వి.సుబ్బారెడ్డి, అధ్యాపకులు సునీల్, డాక్టర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా గండి సునీల్కుమార్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

సిపిఎం బ్రహ్మంగారిమఠం మండల మహాసభల్లో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గండి సునీల్ కుమార్తోపాటు 11 మందిని ఎన్నుకున్నామని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండల కమిటీ సభ్యులుగా సానా గోవింద్ స్వామి, గండి గురయ్య, బడబాగ్ని రవణమ్మ, బి.హరి, దాసరి సుబ్బమ్మ, ఎర్రంపల్లి అజయ్ కుమార్, బైరి ప్రసాద్, రెబ్బా నరసింహులు, చంద్రమ్మ గారి.లక్ష్మీనారాయణను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుందని తెలిపారు. జనవరి 4,5 తేదీలలో కడప నగరంలో జరిగే సిపిఎం జిల్లా 15వ మహాసభలకు మండలం నుంచి 12 మంది ప్రతినిధులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సునీల్ కుమార్, మండల కమిటీ సభ్యులు సానా గోవింద్, హరి, రమణమ్మ పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న జడ్పిటిసి మాజీ సభ్యుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక భవిత కేంద్రంలో విద్యాభ్యాసం చేస్తున్న విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శుక్రవారం వైద్యురాలు షాహీన్ కుమారుడైన సోహేల్ పుట్టిన రోజు సందర్భంగా భవిత కేంద్రంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మాజీ జడ్పిటిసి డాక్టర్ ఎస్ఎఫ్ బాషా హజరై మాట్లాడారు. చిన్నారుల మధ్య సోహేల్ పుట్టిన రోజు వేడుకలు చేయడం సంతోషకరమని విభిన్న ప్రతిభావంతుల పిల్లలు ఎందులోనూ తీసి పోరని చెప్పారు. అనంతరం టీవీ ప్రోగ్రాంలో పాల్గొన్న రవళి, కావ్య, చందు, లావణ్య, విష్ణు, సిద్ధిక్కు సర్టిఫికట్లును ఇచ్చారు. ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు తిధి భోజనం పెట్టారు. భవిత కేంద్రంలో పని చేస్తున్న సిజివి సుజాత భర్త మధు ఇటీవల మృతి చెందడంతో అ కుటుంబానికి హెల్పింగ్ చారిటీస్ తరపున రూ 5 వేలను డాక్టర్ షాహీన్, షకీలా, షమీవున్ కలిసి బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, ఐఇఆర్టిలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 13/2019 In O.S.No. 63/2015

మాదరు గారి హుసేన్ బాబు ... D.Hr

V/S

దూదేకుల పెద్దన్న Died by his Lrs

1) దూదేకుల సరిత,
W/o. లేట్ కిరణ్ కుమార్,
Door No. 39/578-3,
అరవింద నగర్,
Near తేజ పెట్రోల్ బంక్,
కడప జిల్లా. ... J.Dr No. 5

J.Dr No.5 వేలం నోటీసు కొరకు

(Order 21 Rule 66, 68 of C.P.C)

పై ఈ పి నెంబర్ లో పై కోర్టులో ఈ పి దాఖలు చేసి పలుమార్లు నీకు వేలం నోటీసులు పంపినప్పటికీ నీకు ముట్టనందున పై ఈ పీలో నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల నీవు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని 17-12-2024 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై ఈపీ ను విచారించి మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 17-12-2024

S. చంద్రశేఖర్ రెడ్డి,
C.G. ఓబులేసు,
అడ్వకేట్స్, కోవెలకుంట్ల.
Cell No.9885224734